
సాక్షి
బాపట్ల

ఆదివారం | 10 | సెప్టెంబర్ | 2023



ఆలయానికి విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి గుంటూరుకు చెందిన అక్షరవల్లి డెవలపర్స్ నిర్వాహకులు రూ.5,11,116 విరాళం అందజేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 6,034 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 266 క్యూసెక్కులు వదిలారు.

దక్షిణాముఖ ఆంజనేయుడికి నాగవల్లీదళార్చన



ఫిరంగిపురం: స్థానిక సువర్చలా సమేత దక్షిణాముఖ అంజనేయుడికి శనివారం నాగవల్లీ దళాలతో అర్చనలు చేశారు. భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

న్యూస్‌రీల్

11నుంచి రెండో విడత మిషన్ ఇంద్రధనస్సు



నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఈనెల 11 నుంచి 16 వరకు రెండో విడత మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు వారి పరిధిలోని గ్రామాల్లో సర్వే నిర్వహించి లబ్ధిదారులను గుర్తించారన్నారు. వారందరికీ ఆరు రోజుల్లో అర్హత ఉన్నటువంటి అన్ని రకాల వ్యాక్సినేషన్ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) గుంటూరు జిల్లా సమావేశం శనివారం గుంటూరు వైద్య కళాశాల ఆవరణలోని సంఘ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులందరినీ ఎలాంటి షరతులూ లేకుండా రెగ్యులర్ చేయాలని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి కె.వి.ఎస్.శివారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కరీముల్లాషాఖాదరి, ఉపాధ్యక్షుడు ఒ.శ్యామ్, నగర శాఖ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పి.హుస్సేన్ ఖాన్, జిల్లా సంయుక్త కార్యదర్శి జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

4,428 కేసులు పరిష్కారం



గుంటూరు లీగల్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం గుంటూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 4,428 కేసులు పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళీశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించినట్లు తెలిపారు. వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కడపటి సమాచారం అందేసరికి సివిల్ కేసులు 441, క్రిమినల్ కేసులు 3,744, ప్రీలిటిగేషన్ కేసులు 243 వెరసి 4,428 కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కోర్టు ప్రాంగణంలోని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ తీరును జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి చంద్రమౌళీశ్వరి స్వయంగా పరిశీలించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 524.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 11,956 క్యూసెక్కులు విడుదలవుతోంది.

పత్తా లేని పచ్చనేతలు

దొంగ దొరికాడు
- అవినీతి కేసులో చంద్రబాబు అరెస్ట్
- హైదరాబాద్‌కు పరిమితమైన ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు
- బాపట్ల జిల్లాలో నిరసన పేరుతో హడావుడి
- బాబు అరెస్ట్ అయినా స్పందించని పార్టీ శ్రేణులు
- సొంతపార్టీలోనూ అంతర్మథనం

టీడీపీ నేతలు ముఖం చాటేశారు. చంద్రబాబు అరెస్ట్‌పై జిల్లాలో స్పందన కనిపించలేదు. ఆ పార్టీ నిరసనలకు పిలుపు ఇచ్చినా ఫలితం లేదు. ఎమ్మెల్యేలున్నా ప్రాంతాల్లో నిరసన ఫొటోల కార్యక్రమంగా సాగింది. జనం లేకపోవడంతో రోడ్లపై టైర్లు కాల్చి ట్రాఫిక్‌కు స్వల్పంగా అంతరాయం కల్పించారు. దీనిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.



బాపట్ల టీడీపీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో పట్టుబడి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్ట్ అయినా ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆందోళనకు దిగలేని పరిస్థితి. శనివారం ఉదయం 6 గంటలకు నంద్యాలలో చంద్రబాబును అరెస్ట్ చేసిన సీఐడీ అక్కడి నుంచి ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల మీదుగా విజయవాడ తరలించారు. ఒకటి రెండు చోట్ల మొక్కుబడిగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

అవినీతి బాగోతంపై క్యాడర్‌లోనూ..

స్కిల్‌డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు పాత్ర ఉందని ఆ పార్టీ కేడర్‌కు ఇప్పటికే స్పష్టమయింది. పైగా తాను రెండు మూడు రోజుల్లో అరెస్ట్ కాబోతున్నానంటూ స్వయంగా ప్రకటించి చంద్రబాబు టీడీపీలో అలజడి లేపారు. బాబు అవినీతిలో కూరుకుపోయాడని, అరెస్ట్ కావడం ఖాయమని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలకు ఇట్టే తెలిసిపోయింది. దీంతో బాపట్ల జిల్లాకు చెందిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు వారం రోజులుగా నియోజక వర్గాలు వదలి హైదరాబాదుకే పరిమితమయ్యారు. బాబు తప్పుచేశారని నమ్ముతున్న టీడీపీ శ్రేణులు అరెస్ట్ అయిన చంద్రబాబు కోసం ఆందోళనలు చేయలేని పరిస్థితి.

బాబును తరలిస్తున్నా..

స్కిల్‌డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో సీఐడీ శనివారం ఉదయం చంద్రబాబును నంద్యాలలో అరెస్ట్ చేసి గిద్దలూరు, ఒంగోలు, మేదరమెట్ల, చిలకలూరిపేట, గుంటూరు మీదుగా విజయవాడకు తరలించింది. బాబును అరెస్ట్ చేసి రోడ్డు మార్గంలో తరలించడం కష్టమని తొలుత పోలీసులు భావించారు. ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబును అరెస్ట్ చేస్తే ఆ పార్టీ కేడర్ ఊరుకోదని, పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తే మార్గాన్ని మారుస్తూ తీసుకెళ్లాలని నిర్ణయించారు. రోడ్డుమార్గంలో విజయవాడకు తరలించినా నంద్యాల జిల్లా మొదలు దారిలో ఉన్న ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో నామమాత్రంగా కూడా పార్టీ శ్రేణులు వచ్చి అడ్డుకొని నిరసనలు తెలిపిన దాఖలాలు లేవు. ఒకటి రెండు చోట్ల నామమాత్రంగా కార్యకర్తలు రోడ్డు పైకి వచ్చి నినాదాలు చేయడం మినహా బాబు కాన్వాయ్‌కి ఎదురొచ్చిన పరిస్థితి లేదు.

కనిపించని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు..

ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలు నుంచి బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం ప్రారంభమవుతుంది. ఆ పార్టీ ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్ ఉన్నారు. ఆయన హైదరాబాద్‌కే పరిమితమయ్యారు. కార్యకర్తలు మేదరమెట్ల, సంతమాగులూరు వద్ద కొందరు కార్యకర్తలు కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. కాన్వాయ్ వెళ్లినా టీడీపీ క్యాడర్ పట్టించుకోలేదు.

- అద్దంకి తరువాత హైవేపై పర్చూరు నియోజకవర్గం. టీడీపీకి చెందిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు. పైగా ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు. ఆయన కూడా హైదరాబాద్‌కే పరిమితమయ్యారు. ఒంటిగంట ప్రాంతంలో చంద్రబాబును పోలీసులు టోల్‌ప్లాజా మీదుగా తీసుకెళ్లారు. కానీ కార్యకర్తలు అడ్డుకున్న దాఖలాలు లేవు.
- రేపల్లె నియోజకవర్గంలో నిరసన నామమాత్రంగా సాగింది. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, హైదరాబాద్‌లో ఉండిపోయారు. మొక్కుబడిగా కూడా నిరసన కార్యక్రమాలు నిర్వహించలేదు.
- చీరాల నియోజకవర్గంలో ఆందోళనలు నిర్వహించలేని పరిస్థితి. ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య 20 మంది కార్యకర్తలతో గడియారం సెంటర్‌లో పది నిమిషాల్లో నిరసన ముగించారు.
- జిల్లా కేంద్రమైన బాపట్లలో అసలే అంతంత మాత్రంగా ఉన్న ఆ పార్టీ మొక్కుబడిగా నిరసన సాగింది. నియోజకవర్గ ఇన్‌చార్జి నరేంద్రవర్మ హైదరాబాద్‌కే పరిమితమయ్యారు. కార్యకర్తలు, నాయకులు బయటకు రాలేదు. కొందరు మొక్కుబడిగా పార్టీ కార్యాలయానికి వచ్చి మీడియా కోసం ఫొటోలు దిగి వెళ్లిపోయారు.
- వేమూరు నియోజకవర్గంలో ఇన్‌చార్జి నక్కా ఆనందబాబు, అమృతలూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో పాల్గొన్నారు. కొన్ని దుకాణాలు మూయించారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కొంతమందిని హౌస్ అరెస్ట్ చేశారు.

చంద్రబాబు అరెస్ట్ చట్టబద్ధమే: ఎంపీ మోపిదేవి



రేపల్లె రూరల్: ప్రజల సొమ్మును లూటీ చేసిన మాజీ సీఎం చంద్రబాబును చట్టబద్ధంగా అరెస్ట్ చేస్తే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలు చేయటం హేయమని ఎంపీ, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా చేసిన 2014–19 మధ్యకాలంలో వేలకోట్లకు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రూ.371కోట్ల అవినీతికి పాల్పడినట్లు విచారణలో తేలిందని వివరించారు. ఆ మేరకు సీమెన్ సంస్థతో ఒప్పందం చేయకుండానే చేసినట్లుగా డాక్యుమెంట్లు సృష్టించి కోట్లాది రూపాయలను వివిధ కంపెనీలకు జమ చేసినట్లుగా చూపుతూ తన ఖాతాలో వేసుకున్నారని పేర్కొన్నారు. ఈ కుంభకోణంపై 2021 నుంచి మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం మేరకు దర్యాప్తు చేసి ఇప్పటికే పలువురు నిందితులను సీఐడీ అరెస్ట్ చేసిందని చెప్పారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి అయిన చంద్రబాబును ఏ 1గా చేర్చి విచారణ నేపథ్యంలో సీఐడీ అరెస్ట్ చేసిందన్నారు. త్వరలోనే ఏ 2, ఏ 3లుగా ఉన్న లోకేష్, అచ్చంనాయుడు హాజరుకాక తప్పదన్నారు. రాజధాని నిర్మాణంలో భాగంగా పలు కార్యాలయాల నిర్మాణాలకు షాపూజీ, పల్లంజీ, ఎల్అండ్‌టీ కంపెనీల నుంచి రూ.118కోట్లను చంద్రబాబు ముడుపులుగా తీసుకున్నారని, దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఐటీ శాఖ నోటీసులు జారీ చేసిందని తెలిపారు. కేవలం రూ.650 కోట్ల భవన నిర్మాణంలోనే రూ.118 కోట్ల కమిషన్‌లు తీసుకున్నారంటే అమరావతి భవన నిర్మాణాలలో ఎన్నివేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారో పూర్తి విచారణలో తెలుస్తుందని చెప్పారు. సమావేశంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ డి.మల్లికార్జునరావు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు అంజయ్య పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 769 కేసులు పరిష్కారం

బాపట్ల: జాతీయ లోక్‌అదాలత్‌లో శనివారం మొత్తం 769 కేసులు పరిష్కారమయ్యాయి. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.సాదుబాబు, న్యాయమూర్తులు కె.సీతారామకృష్ణారావు, జి.వాణి, జి.రుక్మిణి కేసుల విచారణ చేపట్టారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహేంద్రనాథ్, న్యాయవాదులు లీలా కృష్ణా, జి.శ్యామలా, సురేష్‌బాబు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారిగా మూర్తి



బాపట్ల: బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారిగా ఏవీఎస్ఎస్ మూర్తి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న లక్ష్మీశివజ్యోతి నెల్లూరు డీఆర్‌ఓగా బదిలీపై వెళ్లారు. ఏలూరు నుంచి మూర్తి బాపట్లకు బదిలీపై వచ్చారు. రెవెన్యూ పరంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని మూర్తి చెప్పారు.

ఇక డిజిటల్ బోధన

సర్కార్ బడుల్లో ప్రారంభం
- తరగతి గదుల్లో ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ)ఏర్పాటు
- ఈ ఏడాది 708 ప్రభుత్వ స్కూళ్ల ఎంపిక
- జిల్లాకు 1639 ఐఎఫ్‌పీలు, 543 స్మార్ట్ టీవీలు



ఐఎఫ్‌పీల ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

బాపట్ల అర్బన్: ప్రభుత్వ బడుల్లో ఇక డిజిటల్ బోధన ప్రారంభమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాడు– నేడుతో పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యాబోధనకు శ్రీకారం చుట్టారు. పేద పిల్లలు భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నాయి.

నాడు– నేడుతో మహర్దశ

మనబడి నాడు– నేడు కింద ప్రభుత్వ పాఠశాలను ఆధునికీకరించారు. ప్రాథమిక స్థాయి నుంచి హైస్కూల్ వరకు వివిధ దశల్లో పాఠశాలలను అభివృద్ధి చేశారు. అన్ని వసతులు కల్పించారు. దీంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నుంచి యూనిఫాం, బూట్ల వరకు కూడా ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. వీటితో పాటు సాంకేతికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్మార్ట్ టీవీలను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ)ఏర్పాటు చేసి విద్యార్థులకు దృశ్య, శ్రవణ పద్ధతుల్లో సరికొత్త బోధనను అందుబాటులో తెచ్చారు.

ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలతో బోధన

బాపట్ల జిల్లాలో 708 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో 1639 ఐఎఫ్‌పీ, 543 స్మార్ట్ టీవీలు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. వీటివల్ల 1,76,000 మంది విద్యార్థులకు డిజిటల్ బోధన చెరువు కానుంది. అందులో భాగంగా మొదటి విడతలో 847 ఐఎఫ్‌పీలు, 358 స్మార్ట్ టీవీలను కేటాయించారు. ప్రస్తుతం వీటిని ఆయా స్కూల్లో ఏర్పాటు చేయడంతో డిజిటల్ తరగతులు కొనసాగుతున్నాయి. రెండో విడతలో 792 ఐఎఫ్‌పీలు, 235 స్మార్ట్ టీవీలను అందించనున్నారు. విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాలను అర్థం చేసుకునేందుకు డిజిటల్ తరగతులు దోహదపడతాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఒకటో తరగతి నుంచి..

ఒకటి నుంచి ఐదో తరగతి వరకు స్మార్ట్ టీవీలు, మూడు నుంచి 10వ తరగతి వరకు ఐఎఫ్‌పీలు ద్వారా బోధన చేయనున్నారు. ఇప్పటికే జిల్లాలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయులకు ప్రభుత్వం బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ఉచితంగా అందజేసింది. స్మార్ట్ టీవీ లకు ఇంటర్నెట్ అనుసంధానం చేసి ఐఎఫ్‌పీలకు యూట్యూబ్‌ను కనెక్ట్ చేసి పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. ప్రాధాన్య అంశాలను ఫైల్ రూపంలో సేవ్ చేసుకొని అవసరం ఉన్నప్పుడు తిరిగి వినే అవకాశం ఉంటుంది. ఈ విధానం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పోటీపడి ఉత్తమ ఫలితాలను సాధించే అవకాశం ఉంటుందని విద్యావేత్తలు చెబుతున్నారు.

ఐఎఫ్‌పీతో ఉపయోగాలు ఇవే..

- ఐఎఫ్‌పీతో దృశ్య శ్రవణ ఇంట్రాక్టివ్‌తో కూడిన 2డీ, 3డీ యానిమేటర్ కంటెంట్ బోధన అందుతుంది.
- విద్యార్థికి సులభంగా బోధించేందుకు ఉపయోగపడుతుంది.
- ప్రపంచ స్థాయిలో పోటీపడే లక్ష్యంతో విద్యార్థులను తీర్చిదిద్దడానికి సహాయపడుతుంది.
- జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించే నాణ్యమైన విద్యను అందించేందుకు బైజుస్‌తో పాటు ఎన్‌సీఈఆర్‌టీ వారు పాఠ్యాంశ ప్రణాళిక రూపొందిస్తున్నారు.
- ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ బోధన కోసం 2468 మంది ఉపాధ్యాయులకు ఇప్పటికే విద్యాశాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు.

డిజిటల్ బోధనలతో ఉత్తమ ఫలితాలు



ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు బైజుస్ కంటెంట్‌తో ట్యాబ్‌ల సాయంతో కూడిన బోధన వలన పాఠశాల విద్యలో మంచి ఫలితాలు సాధించవచ్చు. విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమవుతాయి. అవగాహన పెంచుకోవచ్చు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరుగుతోంది. శ్రద్ధగా పాఠాలు వినడంతో పాటు కొత్త అంశాలను నేర్చుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతారు.

– రామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి, బాపట్ల

బాబు అరెస్ట్ రాష్ట్రానికి శుభపరిణామం

బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి



బాపట్ల: చంద్రబాబునాయుడున్ని అరెస్టు చేయటం రాష్ట్రానికి శుభపరిణామమని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు దిట్టగా అని చెప్పారు. ఈ పరిస్థితుల్లో వ్యవస్థల మీద నమ్మకం పోతున్న దశలో.. చంద్రబాబును అరెస్టు చేయడంతో సామాన్య ప్రజలకు కూడా ఇప్పుడు వ్యవస్థలపై నమ్మకం కలుగుతుందని వివరించారు. చంద్రబాబునాయుడు ఇంతకాలం తప్పించుకుని తిరుగుతున్నాడని, నిజం నిలకడ మీద అయినా బయటకు వస్తుందన్నట్టుగానే చంద్రబాబు స్కిల్ స్కాములో అడ్డంగా దొరికిపోయాడని ఎమ్మెల్యే చెప్పారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని, ఎంతటివారైనా చట్టం ముందు సమానమేనని, చట్టం తన పని తాను చేసుకుపోతుంది అన్నది రుజువైందన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగాలు ఆశ చూపెట్టి.. స్కిల్ డెవలప్‌మెంటు పేరుతో రూ.371 కోట్లు చంద్రబాబు నొక్కేయటం బాధకరమన్నారు. చంద్రబాబు ఒక రకంగా యువతను మోసం చేశాడని ధ్వజమెత్తారు. మరోరకంగా ప్రజల సొమ్మును దోచేశాడని, ఇన్ని సాక్ష్యాధారాలతో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయినా... పవన్ కల్యాణ్, సీపీఐ నారాయణ లాంటి వాళ్లు, బాబును సమర్థించడం దారుణమన్నారు. చంద్రబాబు నాయుడున్ని సమర్థించేవారికి బాబు ఇచ్చే గిఫ్టులే ముఖ్యమనే రీతిలో ఉందని ఎద్దేవా చేశారు.

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు దోషి

వైఎస్సార్ సీపీ చీరాల ఇన్‌చార్జి వెంకటేష్



మాట్లాడుతున్న కరణం వెంకటేష్

చీరాల: టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ముమ్మాటికీ దోషేనని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. శనివారం రామకృష్ణాపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కుంభకోణంలో దోషి అని గ్రహించిన చంద్రబాబునాయుడు కొంతకాలంగా ఆందోళనతో ఉన్నారన్నారు. ఏ నేరం చేయకుండా తనను త్వరలో అరెస్టు చేస్తారని, జైలుకు పంపుతారని ప్రజలు తన కోసం పోరాటం చేయాలని బహిరంగ సభల్లో స్వయంగా చంద్రబాబు అనడాన్ని చూస్తే ఆయన తన తప్పును ఒప్పుకున్నారని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చంద్రబాబును అక్రమంగా అన్యాయంగా అరెస్టు చేస్తుందని టీడీపీ నేతలు విమర్శలు అర్ధ రహితమని చెప్పారు. చంద్రబాబు అరెస్టుపై టీడీపీ నాయకులు లోకేష్, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

తప్పు చేశారు కాబట్టే అరెస్టు..

కొందరు టీడీపీ నాయకులు తప్ప ప్రజలెవ్వరు చంద్రబాబు అరెస్టును వ్యతిరేకించడం లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశంలో కూడా లేరని, వ్యక్తిగత పర్యటనపై లండన్ వెళ్లారని కేవలం దర్యాప్తు సంస్థలే ఈ కుంభకోణంలో నిందితుడుగా ఉన్న చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. కేవలం చంద్రబాబు అరెస్టుకే గగ్గోలు పెడుతున్న టీడీపీ, ప్రతిపక్షాలు గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అన్యాయంగా అరెస్టు చేసి 16 నెలలు జైలులో పెడితే కనీసం నైతికంగా కూడా మద్దతివ్వలేదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ రామసుబ్బులు, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు ఉన్నారు.

టీడీపీ నేతల హల్‌చల్

జే పంగులూరు: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్టు చేసి రోడ్డు మార్గంలో తరలిస్తుండగా జాతీయ రహదారిపై టీడీపీ కార్యకర్తలు కొద్దిసేపు హల్‌చల్ చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ప్రధాన నిందితుడైన చంద్రబాబును సీఐడీ అధికారులు శనివారం అరెస్టు చేసి విజయవాడకు కాన్వాయ్‌లో తీసుకువస్తుండగా మండల పరిధిలోని జాతీయ రహదారిపై ముప్పవరం గ్రామం సమీపంలోకి వచ్చేసరికి టీడీపీ నాయకులు రోడ్డుపై టైర్లు తగలబెట్టి చంద్రబాబు కాన్వాయ్‌ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు స్వల్ప లాఠీ చార్జ్ చేశారు. రేణింగవరం ఎస్‌ఐ తిరుపతిరావు మండలంలోని ఐదుగురు టీడీపీ నాయకులను హౌస్ అరెస్టు చేయగా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన మరో ఐదుగురుని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

చంద్రబాబు పాపాల పుట్ట పగిలింది

- ఎన్‌టీఆర్ ఆత్మకు నిజమైన శాంతి
- అవినీతి బాబుకు అండగా పవన్
- ఎమ్మెల్సీ పోతుల సునీత


మాట్లాడుతున్న పోతుల సునీత

ఒంగోలు: ఎన్టీఆర్ ఆత్మకు నిజమైన శాంతి నేడు కలిగిందని శాసన మండలి సభ్యురాలు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాడు ఎన్టీఆర్‌ను చంద్రబాబు వెన్నుపోటు పొడిచినప్పుడు ఎన్టీఆర్ తీవ్ర మానసిక క్షోభకు గురయ్యారని, కానీ ఆ క్షణంలో ఒక్క కుమార్తెకు కూడా దుర్గమ్మ తల్లిని వేడుకోవాలనిపించకపోవడం బాధాకరం అన్నారు. కానీ నేడు అవినీతి, అక్రమాలకు పాల్పడి అరెస్టు అయిన చంద్రబాబును మాత్రం కాపాడమంటూ దుర్గమ్మ తల్లిని వేడుకోవడం విడ్డూరంగా ఉందని చెప్పారు. తండ్రికో నీతి, భర్తకో నీతా అంటూ భువనేశ్వరిని ప్రశ్నించారు. చంద్రబాబు పాపాల పుట్ట పగిలిందన్నారు. 2014–19 వరకు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రూ.371 కోట్ల ఆర్థిక నేరాలకు పాల్పడినట్లు ఆధారాలతో సీఐడీ అరెస్టు చేసిందన్నారు. చట్టాలు అందరికీ ఒకే రకంగా ఉంటాయని, ఎవరికీ చుట్టాలు కాదన్నారు. వారం రోజుల క్రితం ఐటీ డిపార్టుమెంట్ నోటీసులు జారీచేస్తే స్పందించని పవన్ కళ్యాణ్ నేడు చంద్రబాబు అరెస్టును ఖండించడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. అవినీతి అక్రమాలను ప్రశ్నించడమే జనసేన లక్ష్యమని చెప్పిన పవన్, చంద్రబాబుకు అండగా వ్యాఖ్యలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని, ఇదంతా కుమ్మక్కు రాజకీయాల్లో భాగమే అన్నారు. ఇప్పటి వరకు కోర్టుల్లో కేసులు సాగకుండా స్టేలు తెచ్చుకుంటూ కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయి పదేళ్లపాటు హైదరాబాద్ రాజధానిగా ఉండే అవకాశం ఉన్నా కేవలం అవినీతి అక్రమాలతో ప్రజాధనాన్ని స్వాహా చేయాలనే కుట్రతోనే అమరావతికి పారిపోయి వచ్చిన వ్యక్తి చంద్రబాబు అని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో అతిపెద్ద ఆర్థిక నేరానికి చంద్రబాబు పాల్పడ్డారని, లోకేష్ కూడా నాడు మంత్రిగా ఉన్నందువల్ల లోకేష్‌ను కూడా సీఐడీ విచారణ చేయాలని కోరారు.

చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే అరెస్టు

ఏపీ శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ప్రధాన నిందితుడైన చంద్రబాబు తప్పు చేశాడు కాబట్టే సీఐడీ పోలీసులు అరెస్టు చేశారని శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో స్వయంగా ఆయన పెట్టుకున్న సీఎస్ రాసిన ప్రకారం స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో వేలాది కోట్లు పక్కదారి పట్టించినట్లు తెలిసిపోయిందని చెప్పారు. 'తప్పు చేసి అడ్డంగా దొరికపోయి నన్ను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం.. నన్ను అక్రమంగా అరెస్ట్ చేశారని అనడం' విడ్డూరంగా ఉందన్నారు. నా వయసు పెద్దది అని చెబుతున్నావు, నీ హయాంలో ఎంత మందిని పెద్ద వయసున్న వారిని అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. నేరం చేసి అడ్డంగా దొరికిపోయి అరెస్టు చేస్తే తప్పా అని ప్రశ్నించారు. 2014లోనే ఈ స్కామ్ బయటపడి కేసు నమోదైన సంగతి నీకు తెలియదా అని చెప్పారు. రూ.3,350 కోట్లు నీవు సీఎంగా ఉన్న సమయంలో రిలీజ్ చేసినట్లు సీఎస్సే నివేదిక ఇచ్చారని వివరించారు. అంత చేసి మూడు రోజుల నుంచి నన్ను అరెస్ట్ చేస్తారని ప్రజలను రెచ్చగొట్టే ప్రచారం చేయడం ఎంత వరకూ సమంజసమన్నారు. తప్పు చేసి బుకాయిస్తే చట్టం ఊరుకోదన్నారు. గ్లోబల్ ప్రచారానికి చంద్రబాబు చైర్మన్ అని ఎద్దేవా చేశారు. ఇది పాత కేసేనని కక్ష సాధింపు కాదన్నారు. భగవంతుడు అన్నీ చూస్తున్నాడని, ఆయన నీకు ఇదివరకే వైఎస్సార్ సీపీ నుంచి తీసుకున్న సంఖ్యలోనే ఎమ్మెల్యేను ఇచ్చాడని, ఇప్పుడు ఆర్థిక నేరంలోనే ఆ దేవుడే నిన్ను అరెస్టు అయ్యేలా చేశాడన్నారు. నీ కుమారుడి పాదయాత్ర, లోకేష్ వాడే భాష, తెలుగు జాతి తలదించుకునేలా ఉందని విమర్శించారు. ప్రజలు దేవుడు అంతా గమనిస్తూనే ఉన్నాడని చెప్పారు. సమావేశంలో పార్టీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, పట్టణ నాయకుడు కాకాని రాధాకృష్ణమూర్తి, సందిరెడ్డి రమేష్, మునిసిపల్ వైస్ చైర్మన్ దేశు పద్మేష్, పీడీసీసీ సొసైటీ డైరెక్టర్ సోని పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం

వినాయక చవితి అంటే ఊరూవాడా సందడే. గ్రామీణ ప్రాంతాల్లో విగ్రహాన్ని సిద్ధం చేయడం పవిత్ర కార్యంగా భావించేవారు. 40 రోజులు కష్టపడి తయారీదారు పండుగ సమయానికి విగ్రహాన్ని సిద్ధం చేసేవారు. రోజులు మారాయి. ఆ స్థానాన్ని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఆక్రమించేసింది. దీంతో పర్యావరణానికి ముప్పు వచ్చింది. ఈ చవితికైనా మట్టి గణపతిని పూజించి మార్పు తీసుకొద్దాం.

- పర్యావరణానికి మేలు చేద్దాం
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వద్దు


మట్టితో తయారు చేసిన చిన్న వినాయక విగ్రహాలు

అద్దంకి: వినాయక చవితి అనగానే మనకు ముందుగా గుర్తొచ్చేది మట్టి, రాయి, చెక్కతో చేసిన వినాయక విగ్రహాలు. వాటిని ఇళ్లలో పెట్టుకుని పత్రితో పూజించి మరుసటి రోజు మట్టి విగ్రహాలను అందుబాటులో ఉన్న నదులు, కాలువలు, గుంతల్లో నిమజ్జనం చేసేవారు. ఇది ఒకప్పటి మాట. ప్రస్తుతం ఆ స్థానంలో ప్రమాదకర పదార్థామైన ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన భారీ విగ్రహాలు దర్శనం ఇస్తున్నాయి. ఈ విగ్రహాలను పెద్ద పెద్ద పందిళ్లు వేసి పది నుంచి పదిహేను రోజుల పాటు భక్తితో పూజించి నదులు, చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేస్తున్నారు. గత లెక్కలతో పోలిస్తే బాపట్ల జిల్లాలో చిన్న పెద్ద విగ్రహాలతో కలుపుకుని మొత్తం ఏడు నుంచి 8 వేల విగ్రహాలు నిమజ్జనం చేస్తున్నారు. దీంతో ఆయా జలాలు కలుషితం అవుతున్నాయి. ఈ వినాయక చవితినైనా పర్యావరణానికి మేలు చేసే వినాయక విగ్రహాలతో జరుపుకుంటే మంచిదని పర్యావరణ శాస్త్రవేత్తలు కోరుతున్నారు.

పసుపుతో చేసిన విగ్రహం..

పూజల్లో వినాయక విగ్రహాలను పసుపుముద్దతో తయారు చేసి, పూజ అయిన తరువాత నీటిలో కలిపేస్తారు. బియ్యం పిండి లేదా మట్టితో విగ్రహం చేసి పూజించమని పండితులు చెబుతున్నారు. ఒకప్పుడు ఇదే సంస్కృతి ఉండేది. రాను రాను ఆది పూర్తిగా మారిపోయింది. ఇళ్లలో పెట్టే విధానం పూర్తిగా తగ్గిపోయింది. అయితే ఇప్పటికీ పెద్దపెద్ద పందిళ్లలో పెట్టే పెద్ద పెద్ద వినాయక విగ్రహాల వద్ద చిన్న వినాయక విగ్రహం పెట్టే పూజలు చేస్తారు. పెద్ద విగ్రహం అలంకారానికి మాత్రమే పరిమితం అవుతుంది.

ప్రమాదకర ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ..


పర్యావరణ హితంగా తయారు చేసిన మట్టి గణపతి విగ్రహం

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చూడ ముచ్చటగా కనిపించే వినాయక విగ్రహాలు ఎంతో ప్రమాదకరమైనవి. ఈ విగ్రహాలను తయారు చేసేందుకు ఉపయోగించే పదార్థం పర్యావరణానికి హాని చేస్తుంది. ఈ విగ్రహాలను పూజల అనంతరం జలాల్లో నిమజ్జనం చేయడంతో జలాలు విషతుల్యంగా మారుతున్నాయి. దాంతో ఆ నీటిని తాగిన పక్షులు, గేదెలు, చేపలు, తదితర జల చరాలు దీర్ఘ కాలిక రోగాల బారిన పడి మృత్యువాతపడుతున్నాయి. దాంతో ప్రకృతి సమతుల్యత లోపిస్తోంది. ఈ విగ్రహాలతో శ్వాసకోశ సమస్యలు, రక్తానికి సంబంధించిన సమస్యలు, చర్మవ్యాధులతో పాటు ఇతర సమస్యలు వస్తాయి.

అందుబాటులో మట్టి విగ్రహాలు..

పర్యావరణ ప్రేమికులు జిల్లాలోని అద్దంకి, చీరాల, బాపట్ల, వేటపాలెం, కర్లపాలెం, పర్చూరు, కారంచేడు, రేపల్లె, వంటి పట్టణాలు, పల్లెల్లో మట్టితో వినాయక విగ్రహాలను వేలాది సంఖ్యలో ముందుగానే తయారు చేయించి వినాయక చవితి రోజు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. పర్యావరణానికి మేలు చేసే మట్టే కాకుండా, టెంకాయలు, పిండి, కాయగూరల వంటి పదార్థాలతోనూ గణనాథుని ప్రతిష్టిస్తే పర్యావరణానికి మేలు కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- రోడ్డు దాటుతుండగా ఘటన
- ఎస్‌ఎల్‌గుడిపాడులో విషాద ఛాయలు


మృతి చెందిన మంగమ్మ

బల్లికురవ: రోడ్డు దాటుతున్న మహిళను లారీ ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటన మేదరమెట్ల– నార్కెట్‌పల్లి నామ్ రహదారిలోని మండలంలోని ఎస్‌ఎల్ గుడిపాడులో చోటుచేసుకుంది. వివరాలు... గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు రావులపల్లి వెంకటేశ్వర్లు తల్లి మంగాయమ్మ అలియాస్ మంగమ్మ(45) పశువుల మేతకు గ్రామానికి పడమర వైపు ఉన్న పొలాలకు వెళ్లింది. మేత మోపుతో గ్రామంలోకి వస్తుండగా చెన్నై నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆమె తలకు గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో వైద్యానికి నరసరావుపేట తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలికి భర్త కోటేశ్వరరావు, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వెంకట సుబ్బారావు ఫిర్యాదు మేరకు రైటర్ ఎం.సీతారామాంజనేయులు కేసు నమోదు చేశారు. లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మంగమ్మ భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సముద్రంలో దూకి యువకుడి ఆత్మహత్యా యత్నం

యువకుడిని కాపాడిన పోలీసులు


ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

బాపట్లటౌన్: సముద్రంలో దూకి ఓ యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన యువకుడు సురేంద్ర ఎమరా విజయవాడలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సూర్యలంక సమీపంలోని రామచంద్రాపురం బీచ్ వద్ద సముద్రంలో స్నానాలు చేస్తూ ఆత్మహత్యా యత్నం చేశాడు. గమనించిన జాలర్లు సూర్యలంక తీరంలోని అవుట్‌పోస్ట్ పోలీసులకు సమాచారం అందించారు. అవుట్ పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.పోతురాజు రామచంద్రాపురం బీచ్‌కు చేరుకొని ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తిని కాపాడారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ హెడ్‌కానిస్టేబుల్ పోతురాజును అభినందించారు.

విద్యార్థుల్లో శాస్త్రీయభావాలు పెంపొందించాలి

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

చీరాల: విద్యార్థుల్లో చిన్నతనం నుంచే శాస్త్రీయ భావాలను పెంపొందించాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. పద్మశాలీయ కల్యాణ మండపంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో సైన్స్ విషయాలను కాకుండా సూడో సైన్స్ విషయాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థులు సిలబస్ నుంచి డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించడం ద్వారా భావి విద్యార్థులు జీవ పరిణామ క్రమం తెలియకుండా చేశారని పేర్కొన్నారు. సృష్టివాదాన్ని నమ్మే విధంగా తయారు చేయాలనుకోవడం ప్రస్తుత పాలకుల సంకల్పమని వివరించారు. విద్యాలయాల్లో హేతు విరుద్ధమైన వాస్తు, జ్యోతిష్యం, భూతవైద్యం లాంటి వాటిని శాస్త్రాలుగా నమ్మించి అధికారికంగా బోధిస్తూ వాటిల్లో మాస్టర్ డిగ్రీ ప్రదానం చేయడం ద్వారా ప్రభుత్వమే అశాస్త్రీయ ధోరణిని ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. మానవుడి నిత్య జీవనంలో సైన్స్ చాలా అవసరమని విద్యా విధానంలో మార్పులు రావాలని సూచించారు. ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ జాతీయ సహాయ కార్యదర్శి వీజీ గోపినాథన్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా చిల్డ్రన్స్ సైన్స్ ఫెస్టివల్ నిర్వహించడం ద్వారా పిల్లల్లో ఆధునిక విజ్ఞానాన్ని పెంచుతున్నామని చెప్పారు. చెకుముకి ద్వారా విద్యార్థులు సైన్స్ పరంగా విజ్ఞానాన్ని పొందుతున్నారని తెలిపారు. ప్రొఫెసర్ రామచంద్రయ్య మాట్లాడుతూ మానవశ్రమ ద్వారా వచ్చిన శక్తే సైన్స్ అన్నారు. నేడు మాన విజ్ఞాన శాస్త్రంపై దాడి జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేవీవీ ఆహ్వాన సంఘం అధ్యక్షుడు డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు, జేవీవీ నేత రాజశేఖర్ రాహుల్, గోపాలం శివన్నారాయణ, బోయ వెంకటేశ్వరరావు, శ్రీనాథ్, మురళీధర్, కుర్రా రామారావు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి మన్నవ బాబుకు డాక్టరేట్

- స్వగ్రామం నందివెలుగు
- శ్రీకాకుళం జిల్లా రాజాంలో సీనియర్ సివిల్ జడ్జిగా విధులు
- పేదరికాన్ని జయించి న్యాయమూర్తిగా ఎదిగిన బాబు
- ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే పీహెచ్‌డీ సాధన



సీనియర్ సివిల్ జడ్జి మన్నవ బాబు

తెనాలి: రూరల్ పరిధిలోని నందివెలుగు గ్రామానికి చెందిన సీనియర్ సివిల్ జడ్జి మన్నవ బాబు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ పొందారు. 'ఎ రైట్ టు ఎ ఆక్యూజ్డ్ పర్సన్ ఇన్ ఇండియన్ క్రిమినల్ జస్టిస్–క్రిటికల్ ఎనాలిసిస్' అనే అంశంపై సమర్పించిన సిద్ధాంత గ్రంథాన్ని ఉత్తమ పరిశోధనగా భావించి, బహిరంగ మౌఖిక పరీక్షను నిర్వహించి యూనివర్సిటీ పీహెచ్‌డీని ప్రకటించింది. భారతీయ శిక్షా స్మృతిలో నేరస్తులకు గల హక్కులను రాజ్యాంగం ప్రకారం ఇండియన్ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో పొందుపరచినట్టుగా, వాటిని పొందే హక్కు నేరస్తులకు ఎలా ఉందో పరిశోధన చేశారు. రాజ్యాంగం నేరస్తులకు కల్పించిన హక్కులను, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరికీ ఉందని తన పరిశోధన గ్రంథంలో స్పష్టంగా వివరించారు.

శ్రీకాకుళం జిల్లాలోని రాజాంలో సీనియర్ సివిల్ జడ్జిగా చేస్తున్న మన్నవ బాబు పేద కుటుంబం నుంచి ఈస్థాయికి వచ్చారు. మన్నవ వెంకటేశ్వర్లు, జయమ్మ దంపతుల ఏడుగురు సంతానంలో బాబు ఒకరు. విద్యపై ఆసక్తి కలిగినప్పటికీ, ఆయనకు ఆర్థిక పరిస్థితులు సహకరించ లేదు. నిరాశతో కుంగిపోకుండా సెలవు దినాలలో కూలీ నాలీకి వెళుతూ, అవి లేనప్పుడు పెయింటర్‌గా చేస్తూ. రకరకాల పనులతో డబ్బులు సంపాదిస్తూ చదివారు. తాను సంపాదించిన మొత్తంలో కొంత డబ్బును కొంత కుటుంబపోషణకు వినియోగించారు.

ఆవిధంగా లా కోర్సును పూర్తిచేశారు. న్యాయమూర్తి కావాలన్న ఆశయంతో ముందుగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేపట్టారు. తెనాలిలో ప్రముఖ న్యాయవాది ఎస్.రామారావు దగ్గర జూనియర్ న్యాయవాదిగా కొనసాగుతూనే పరీక్షలు రాస్తూ వచ్చారు. మొదటిసారి విజయం సాధించినప్పటికీ ఇంటర్వ్యూలో అవకాశం రాలేదు. దీంతో మళ్లీ ప్రయత్నించారు. 2008లో మూడో ప్రయత్నంలో నెగ్గి, జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మణుగూరులో తొలి పోస్టింగ్‌లో చేరారు. తర్వాత కృష్ణాజిల్లా అవనిగడ్డ, కర్నూలు, కందుకూరులో న్యాయమూర్తిగా సేవలను అందించి, ప్రస్తుతం పదోన్నతిపై శ్రీకాకుళం జిల్లాలో సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్నారు. న్యాయమూర్తిగా ఉద్యోగ బాధ్యతల్ని నిర్వర్తిస్తూనే ఇప్పుడు పీహెచ్‌డీని సాధించటం విశేషం.

ఇదే విషయమై మాట్లాడుతూ, 'ప్రతి ఒక్కరూ పట్టుదలతో కృషి చేస్తే, ఉన్నత స్థానానికి ఎదగొచ్చని, అవరోధాలు ఎదురైనా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది' అని చెప్పారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ కామర్స్, లా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య చల్లపల్లి స్వరూప రాణి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ రెక్టర్ ఆచార్య పి.వరప్రసాద్ మూర్తి, డాక్టర్ పిల్లి వాసు, తెనాలి బార్ అసోసియేషన్ న్యాయవాదులు మన్నవ బాబుకు అభినందనలు తెలియజేశారు.

యానాదుల అభివృద్ధికి కృషి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

నెహ్రూనగర్: ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా యానాదుల అభివృద్ధికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. శనివారం యానాదుల పొలిటికల్ ఫోరం ఆధ్వర్యంలో బీ ఆర్ స్టేడియంలో శనివారం రాత్రి యానాదుల రాజకీయ భేరి భారీ బహిరంగ సభ నిర్వహించారు. ముందుగా ఆంధ్రా ముస్లిం కళాశాల నుంచి బీఆర్ స్టేడియం వరకు అధిక సంఖ్యలో ర్యాలీగా వచ్చారు. ఈసందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ యానాదుల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా యానాదులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. యాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం వై.ఎస్.జగన్ దృష్టికి తీసుకెళతామన్నారు. రాష్ట్రంలో చిన్న చిన్నకులాల అభివృద్ధి, అభ్యున్నతికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ రాజకీయ ప్రాతినిథ్యం కావాలంటూ యానాదుల్లో చైతన్యం రావడం అభినందనీయమన్నారు. పోరాటాలు చేస్తేనే హక్కులు సాధించుకోవచ్చన్నారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ నెల్లూరు కార్పొరేషన్‌కు యానాది కులానికి చెందిన శ్రవంతిని మేయర్‌గా నియమించడం సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ యానాదుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పొలిటికల్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ కె.సి.పెంచలయ్య, సుబ్బయ్య, మేకల శ్రీనివాస చక్రవర్తి, చేవూరి సుబ్బారావు, ఉష, జి.కళ్యాణి, వరలక్ష్మి పాల్గొన్నారు.



ర్యాలీగా తరలిస్తున్న యానాది సంఘీయులు

క్లుప్తంగా

12న గుడివాడలో జాబ్ మేళా

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కృష్ణాజిల్లా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 12న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు ఈ మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హత సాధించిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వయసు ఉండి, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన వారు దీనికి అర్హులని సూచించారు. నెలకు కనీస వేతనం రూ.10 వేలు గరిష్ఠంగా రూ.35 వేల వరకు జీతం ఉంటుందని, ఆసక్తిగల అభ్యర్థులు తమ వివరాలను స్కిల్ డెవలప్‌మెంట్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 79819 38644, 98488 19682 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శ్రీవారి లడ్డూప్రసాదాల విక్రయం



విజయవాడ కల్చరల్: స్థానిక పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో తిరుమల వేంకటేశ్వరస్వామి వారి లడ్డూ ప్రసాదాలను శనివారం విక్రయించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవారి లడ్డూ ప్రసాదాలను భక్తులకు చేరువచేసే కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా రెండో శనివారం విక్రయిస్తున్నారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుంచి వచ్చిన శ్రీవారి భక్తులు నాలుగు వేల లడ్డూలను కొనుగోలు చేశారు. దాతలు ఎస్.మోహనరావు, లక్ష్మి, జి.వి.సురేంద్రనాథ్, జి.వి.శిరీషకుమారి, ఇ.కృష్ణమూర్తి, లక్ష్మీకుమారి, వేణు, మౌనిక సహకారంతో 700 మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు.

16న బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

మచిలీపట్నంటౌన్: ఉమ్మడి కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన అండర్-14, అండర్-17 బాలబాలికల బాస్కెట్ బాల్ జిల్లా జట్లను ఎంపిక చేస్తామని స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి తోట అజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూజివీడులోని టీఐఎస్ సీబీఎస్‌ఈ స్కూల్ ఆవరణలో ఈ ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.. క్రీడాకారులను సకాలంలో హాజరయ్యేలా చూడాలని వ్యాయామ ఉపాధ్యాయులు కోరారు. మరిన్ని వివరాలకు 84998 14311 సెల్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

తెలుగు సాహితీమూర్తులు తేజోదీప్తులు

ఏపీ అధికారభాషా సంఘం చైర్మన్ విజయబాబు

విజయవాడ కల్చరల్: తెలుగు సాహితీమూర్తులు తేజోదీప్తులని, వారి సాహిత్య సేవలను ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు అన్నారు. శ్రీదేవి కళానాట్య మండలి, గుమ్మడి జయరాజ్ కళాపీఠం, సాయి హృదయ నాట్యమండలి ఆధ్వర్యంలో బలిజేపల్లి లక్ష్మీకాంత కవి రచించిన సత్య హరిశ్చంద్ర జాతీయ పద్యగాన పోటీలను గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం విలాస్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి శనివారం ప్రారంభించారు. అనంతరం విజయబాబు మాట్లాడుతూ.. పద్యనాటకం తెలుగువారి ఆత్మ అని, దానికి పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలుగు సాహిత్య చరిత్రలో కవి జాషువా వంటి సాహితీమూర్తులు అరుదుగా కనిపిస్తారని, తన జీవితంలో జరిగిన అనేక ఘటనలు ఆయనకు మహాకవిగా తీర్చిదిద్దాయని వివరించారు. బలిజేపల్లి రచించిన హరిశ్చంద్ర నాటకం తెలుగు నాటకరంగంలో విశిష్ట స్థానం దక్కించుకుందని కొనియాడారు. డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజారెడ్డి పద్యనాటక పోటీల నిర్వాహకుల కృషిని అభినందించారు. వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం కృష్ణా జిల్లా అధ్యక్షుడు గుమ్మడి విజయకుమార్ మాట్లాడుతూ.. ఈ పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని తెలిపారు. కార్పొరేటర్ బాలి గోవింద్, రంపచోడవరం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇట్టా విఠల్, రంగస్థల ప్రముఖులు అగురు త్రినాథ్ నాయుడు, గుమ్మడి జీవన్‌కుమార్, చింతలపూటి నాగేశ్వరరావు, మోత్రు ఆంథోని తదితరులు పాల్గొన్నారు. పద్యగాన పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30కి పైగా జట్లు పాల్గొన్నాయి.

దసరా క్యూలైన్ పనులకు నేడు పూజా కార్యక్రమాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాల ఏర్పాట్లు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆదివారం ఉదయం 10.30 గంటలకు కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి వద్ద నుంచి క్యూలైన్ పనులను ప్రారంభించనున్నారు. క్యూలైన్ పనులకు ఆలయ చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబలతో పాటు పాలక మండలి సభ్యులు, ఆలయ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది హాజరవుతారు.

సూర్యలంక తీరంలో నిఘా

- పర్యాటకుల రక్షణే ధ్యేయం
- వీకెండ్స్‌లో రోజుకు 50 వేల మందికి పైగా రాక
- తీరం వెంబడి నిత్యం గస్తీ నిర్వహిస్తున్న గజ ఈతగాళ్లు
- వాచ్ టవర్లు నిర్మాణం



సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు(ఫైల్)

బాపట్లటౌన్: సూర్యలంక సముద్రతీర ప్రాంతానికి పర్యాటకులు తాకిడి రోజురోజుకు పెరుగుతోంది. పర్యాటకుల వారంతంలో అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. గతంలో సూర్యలంక సముద్ర తీరానికి కేవలం కార్తీక మాసంలో మాత్రమే పర్యాటకుల తాకిడి ఉండేంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యాటకులకు వసతులు కల్పించేందుక ప్రాధాన్యం ఇవ్వడంతో తీరం కళకళలాడుతోంది.

బీచ్‌ల గుర్తింపు ఇలా..

సూర్యలంక తీరంతో పాటు బాపట్ల జిల్లాలోని చీరాల సమీపంలోని రామాపురం, వాడరేవు, పాండురంగాపురం బీచ్‌లు సందర్శకులు తాకిడి అధికంగా ఉంది. ప్రధానంగా హైదరాబాద్ సిటీతో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి అధికంగా సందర్శకులు ఇక్కడి బీచ్‌లకు వస్తున్నారు. వైజాగ్, గోవా, చెన్నైలతో పోలిస్తే తెలంగాణ ప్రజలకు బాపట్ల, చీరాల బీచ్‌లు మరింత దగ్గరగా ఉన్నాయి. రైల్వేతో పాటు ఇతర రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

పర్యాటకుల పరిరక్షణే ధ్యేయంగా..

ఆహ్లాదం కోసం సూర్యలంక సముద్ర తీరానికి వచ్చే సందర్శకుల భద్రకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అందుకు అనుగుణంగా నిఘా పెంచారు. ప్రతి మూడు వందల మీటర్లకు ఒక వాచ్ టవర్ చొప్పున ఏర్పాటు చేశారు. స్నానాలు ఆచరించే ప్రాంతం అంతా పోలీసుల నిఘా నేత్రంలో ఉండేలా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో వీటిని ఏర్పాటు చేశారు. వాచ్ టవర్లపై నిత్యం షిఫ్టులు వారీగా పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. నిత్యం పర్యాటకులకు సూచనలు, సలహాలు ఇస్తూ ప్రమాదాలకు గురికాకుండా చూస్తున్నారు.

అక్కడే ప్రాథమిక చికిత్స

తీరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎలాంటి ఘటనలు చోటుచేసుకున్న తక్షణమే వైద్యసేవలు అందించారు. సముద్రంలో మునిగిన వారిని గుర్తించి తక్షణమే పోలీసులు వైద్యశాలకు తీసుకురావడం వలన ప్రాణపాయం నుంచి కాపాడుతున్నారు.



తీరంలో నూతనంగా ఏర్పాటుచేసిన వాచ్‌టవర్లు

అందుబాటులో గజ ఈతగాళ్లు..

తీరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా తీరప్రాంత గ్రామాల్లోని మత్స్యకార కుటుంబాలకు చెందిన పది మంది గజ ఈతగాళ్లను అధికారులు నియమించారు. వీరంతా ప్రతి వంద మీటర్లకు ఒకరు చొప్పున విధులు నిర్వర్తిస్తూ తీరంలో ఎవరైనా లోతుకు వెళ్తున్నా, గల్లంతైనా వారిని వెంటనే తీరానికి చేరుస్తూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. గతేడాది అక్టోబర్ వీరిని నియమిస్తే.. ఇప్పటి వరకు సుమారు 22 మందికి పైగా సందర్శకులను కాపాడారు.



సముద్రంలో గల్లంతైన పర్యాటకులను కాపాడుతున్న గజ ఈతగాళ్లు

పర్యాటకులు రక్షణార్థం తీరం వెంబడి గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. సముద్రంలో స్నానాలు చేస్తూ ప్రమాదవశాత్తు ఎవరైనా గల్లంతైతే వెంటనే వారిని రక్షిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తీరం వెంబడి ప్రత్యేకంగా మూడు వాచ్ టవర్లను ఏర్పాటుచేసి, నిత్యం పోలీసులు నిఘా పెట్టారు.

ప్రమాదాలు ఇలా..

సూర్యలంక సముద్రతీరంలో అమావాస్యకి, పౌర్ణమికి సముద్రం అటుపోట్లకు గురవుతూ ఉంటుంది. ఆ సమయంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో వీచే గాలులు నేరుగా వస్తే సముద్రం నిలకడగా ఉంటుంది. గాలులు ఏటవాలుగా వీచినప్పుడు సముద్రంలో గుంతలు ఏర్పడతాయి. ఆ గంతల్లో యాత్రికులు పడినప్పుడు అలల తాకిడి వలన సముద్రంలో కొట్టుకుపోతున్నారు. బంగాళాఖాతంలో వాయుగుండం పడినప్పుడు, అల్పపీడనం పడినప్పుడు తీరంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంటుంది.

వీటితోపాటు సముద్రంలో దక్షిణ గాలి, పడమర గాలులు వీస్తుంటాయి. ఆ సమయంలో సముద్రంలో నీరు నలుపు రంగుగా మారుతుంది. వెంటనే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఆ సమయంలో సముద్రంలో అలల తాకిడి పెరిగి అలలు వేగంతో వస్తుంటాయి. వీటి వలన ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉంటుంది.

25 మంది ప్రాణాలు కాపాడం



సూర్యలంక తీరంలో ఎనిమిది నెలల క్రితం సముద్రంలో అలల తాకిడికి గురై ఒకేసారి ఆరుగురు మృతి చెందారు. వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్, ఎస్పీలు తీరంలో మృత్యువాతకు గురవుతున్నవారిని కాపాడేందుకు పది మంది గజ ఈతగాళ్లను నియమించారు. ప్రతి 100 మీటర్లకు తీరం వెంబడి విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికి 22 మంది ప్రాణాలు కాపాడారు.

– సుబ్బారావు, మెరైన్ సీఐ

పర్యాటకులను కాపాడటమే మా ధ్యేయం



తీరంలో అలల తాకిడికి గురైన వారిని కాపాడేందుకు పది మందిని తీరంలో విధులు నిర్వర్తించేందుకు నియమించారు. మేము ప్రతి వంద మీటర్లకు ఒకరు చొప్పున విధులు నిర్వర్తిస్తూ తీరంలో ఎవరైనా సరదాగా మునుగుతూ లోతుకు వెళితే వెంటనే అప్రమత్తం చేస్తున్నారు. సముద్రంలోకి మునుగుతుంటే వారిని కాపాడి తీరం ఒడ్డుకు తీసుకొస్తున్నాం. ఇప్పటికి 22 మంది ప్రాణాలు కాపాడాం.

– సురేష్, గజ ఈతగాడు

ఇప్పటికే చాలా ఆలస్యమైంది

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా



తాడికొండ: అధికారాన్ని అడ్డుపెట్టుకుని పేదల రక్తం పీల్చిన చంద్రబాబు అరెస్టు ఇప్పటికే ఆలస్యమైందని గుంటూరు జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అన్నారు. శనివారం తాడికొండ మండలం లాం గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 29 అవినీతి కేసుల్లో బెయిల్ తెచ్చుకుని బయట తిరుగుతున్న చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేయడంలో సిద్ధహస్తుడని అన్నారు. అవినీతి పాపాల పుట్టపగిలి నేడు అరెస్టు జరిగిందన్నారు. బాబుపై ఉన్న స్టేలన్నీ ఎత్తివేసి పూర్తిస్థాయి విచారణ చేసి అధికారాన్ని అడ్డుపెట్టుకుని దోపిడి చేసిన అనినీతీ సొమ్మును రికవరీ చేయాల న్నారు. వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఏపాపం ఎరుగని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని బాబుకు బెయిల్ కోసం రూ.కోట్లు వెచ్చించి వ్యవస్థలను మభ్యపెట్టేందుకు న్యాయవాదులను రంగంలో దించడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ పూర్ణచంద్రబాబు, ఎంపీటీసీ ఆర్.దివ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాజకీయాలకు తావులేదు

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



మంగళగిరి: చట్టం తనపని తాను చేసుకుపోతుందని, ఇందులో రాజకీయాలకు తావు లేదని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు స్పష్టం చేశారు. చంద్రబాబు అవినీతికి పాల్పడ్డాడు కాబట్టే సీఐడీ అరెస్ట్ చేసిందన్నారు. ఆధారాలతోనే సీఐడీ అధికారులు చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, తప్పు చేస్తే ఎవరికైనా శిక్ష తప్పదన్నారు. చంద్రబాబు విషయంలో అన్ని ఆధారాలు ఉండబట్టే సీఐడీ అరెస్ట్ చేసిందన్నారు. టీడీపీ నాయకులు అనవసరంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పనులు చేయకూడదని హితవుపలికారు.

ఎన్టీఆర్ ఆత్మ శాంతిస్తుంది

నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు



నెహ్రూనగర్: వెన్నుపోటుదారుడు, అవినీతి పరుడైన నారా చంద్రబాబునాయుడు అరెస్ట్‌తో నందమూరి తారకరామారావు(ఎన్టీఆర్) ఆత్మ శాంతించిందని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అరెస్ట్‌పై ఆ పార్టీ నాయకులు, పవన్ కళ్యాణ్ చేస్తున్న రాద్ధాంతంపై శనివారం సంపత్ నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 2014లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన 2 నెలల్లోనే స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరుతో రూ.3,356 కోట్ల కుంభకోణానికి తెరతీశారని ఆరోపించారు. దీనిపై పలు ఆధారాలను సేకరించి చంద్రబాబు ప్రమేయం ఉందని రుజువు చేయడంతో శనివారం సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారన్నారు. చంద్రబాబు అరెస్ట్ కాగానే దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ ప్రత్యేక విమానంలో చంద్రబాబు నాయుడుని కలిసేందుకు తాపత్రయపడటం చూస్తుంటే దత్తపుత్రుడు అన్నదానికి సార్థకత చేకూరిందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి రాష్ట్రంలో టీడీపీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారే తప్ప బీజేపీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయడం లేదన్నారు. చంద్రబాబుకి ఐటీ నోటీసులు ఇచ్చారంటే అవి కావనే అన్న పురందేశ్వరికి రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు అరెస్ట్‌తో రాష్ట్రంలో ఒక పీడా పోయిందని, ముఖ్యంగా ఎన్టీఆర్ ఆత్మ శాంతిస్తుందని, ప్రజలు కూడా చంద్రబాబు అరెస్ట్‌తో సంబరాలు చేసుకుంటున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, నాయకులు గేదెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 13,511 కేసులు పరిష్కారం

చిలకలపూడి(మచిలీపట్నం): ఉమ్మడి కృష్ణాజిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 13,511 కేసులను పరిష్కరించామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 42 బెంచ్‌ల ద్వారా లోక్ అదాలత్ నిర్వహించామని పేర్కొన్నారు. 12,819 క్రిమినల్, 224 సివిల్, 143 చెక్‌బౌన్స్, 257 ప్రీలిటిగేషన్ కేసులు, 68 మోటారువాహన ప్రమాద క్లయిమ్‌లను పరిష్కరించామని వివరించారు. 68 మోటారు వాహన ప్రమాద క్లయిమ్‌లకు సంబంధించి రూ.3,22,25,000 నష్టపరిహారంగా ఇచ్చేందుకు ఇన్సూరెన్స్ కంపెనీలు అంగీకరించాయని తెలిపారు. 257 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించి అవార్డులు జారీ చేశామని పేర్కొన్నారు. మచిలీపట్నం కోర్టులో 2,082 కేసులు, విజయవాడ 3,037, గుడివాడ 630, నందిగామ 1056, నూజివీడు 1,300, మైలవరం 192, జగ్గయ్యపేట 783, బంటుమిల్లి 516, కైకలూరు 1,022, తిరువూరు 345, గన్నవరం 988, అవనిగడ్డ 498, మొవ్వ 727, ఉయ్యూరు కోర్టులో 335 కేసులను పరిష్కరించామని పేర్కొన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్ దోహదపడుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య అన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా 42 బెంచ్‌ల ద్వారా శనివారం లోక్‌అదాలత్ నిర్వహించారు. మోటారు వాహన ప్రమాద బీమా కేసుకు సంబంధించి చిల్లిముంత వెంకటకృష్ణమోహన్‌కు రూ.1.30 లక్షల చెక్కును జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక చేతుల మీదుగా అందించామన్నారు.

బాబు అరెస్టు సక్రమమే

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం



పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అరెస్ట్ అక్రమమని టీడీపీ నేతలు గగ్గోలు పెట్టడం హాస్యాస్పదమని శాసనమండలి సభ్యులు చంద్రగిరి ఏసురత్నం విమర్శించారు. గుజ్జనగుండ్లలోని ఆయన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో ప్రభుత్వ ధనాన్ని దోచుకోవడం అంటే ప్రజలను దోచుకోవడమేనన్న విషయాన్ని మరిచి, అవినీతి చేశారు కాబట్టే సీఐడీ అరెస్ట్ చేయటం జరిగిందన్నారు. సీఐడీ కాకుండా ఈడీ, జీఎస్టీ వంటి కేంద్ర సంస్థలు సైతం చంద్రబాబు స్కాంను బట్టబయలు చేశాయన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసి భారతదేశ రాజకీయాల్లో ప్రధాన పాత్ర పోషించాను అని చెప్పుకునే చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారన్నారు. చంద్రబాబు చేసిన తప్పుకు అరెస్ట్ అయితే.. దానికి రాజకీయ రంగు పులమటం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు పీఏ శ్రీనివాస్ అకౌంట్‌లోని వందలాది కోట్లు ఎలా వచ్చాయో చెప్పగలరా అని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్ట్ విషయంలో టీడీపీ నేతల కుట్రలను ప్రజలు నమ్మవద్దన్నారు.

చంద్రబాబు అరెస్టు న్యాయబద్ధమే

గుంటూరు, కృష్ణా జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్



పట్నంబజారు: నారా చంద్రబాబు నాయుడు అరెస్టు చట్టబద్ధమేనని శాసనమండలి సభ్యుడు, వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణా జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ చెప్పారు. శనివారం 'సాక్షి'తో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టుకు సంబంధించి అన్ని ఆధారాలతోనే ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం పాలు చేసినందుకు అరెస్టు చేశారన్నారు. చట్టానికి ఏ ఒక్కరూ అతీతులు కాదని, చంద్రబాబు అరెస్టును రాజకీయం చేయడం సరికాదన్నారు. ఆయన అధికారంలో ఉండగా చేసిన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌కు సంబంధించి స్పష్టంగా అన్ని ఆధారాలు సేకరించిన తరువాత అచ్చెన్నాయుడును అరెస్టు చేసి అందులో చంద్రబాబు పాత్ర ఉందని నిర్ధారణకు వచ్చిన అధికారులు చంద్రబాబును విచారణ కోసం అరెస్టు చేశారన్నారు. ఈకేసుకు సంబంధించి ఏదైనా ఉంటే కోర్టులో తన సచ్ఛీలతను చంద్రబాబు నిరూపించుకోవాలన్నారు. మాజీ సీఎంను అరెస్టు చేయడమంటే అంత సామాన్యమైన విషయం కాదని, అన్ని ఆధారాలు పక్కాగా ఉంటేనే సాధ్యపడుతుందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. చంద్రబాబు అరెస్టు విషయంలో రాజకీయ దురుద్దేశం ఏ ఒక్కటీ లేదన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. టీడీపీ నేతలు హడావుడి సృష్టించడం కేవలం పబ్లిసిటీలో భాగమేనని ఆరోపించారు. చట్టం అందరికి సమానమేనన్న విషయాన్ని గ్రహించాలన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ





క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు, దర్శనం అనంతరం ఆలయం వెలుపలకు వస్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మను దర్శించుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు శనివారం ఇంద్రకీలాద్రికి భారీగా తరలివచ్చారు. వీకెండ్ కావడంతో ఉదయం నుంచి భక్తుల తాకిడి అధికంగానే కనిపించింది. రద్దీ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. సాధారణ భక్తులతో పాటు శ్రావణ సుముహూర్తపు వేళ ఒక్కటైన నవ వధూవరులు, వారి కుటుంబీకులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన నవ దంపతులకు రూ.500 క్యూలైన్‌లోకి ఉచితంగా అనుమతించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనానికి ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తుల వాహనాలతో ఘాట్‌రోడ్డు నిండిపోగా, ఉదయం 9 గంటల నుంచే కొండపైకి ద్విచక్ర వాహనాలు మినహా ఇతర వాహనాలను అనుమతించలేదు. దీంతో కనకదుర్గనగర్, కెనాల్ రోడ్డు, సీతమ్మ వారి పాదాలతో పాటు హెడ్ వాటర్‌వర్క్స్ వద్ద కార్లు, ఇతర వాహనాలను నిలుపుకుని దేవస్థాన బస్సులో కొండపైకి చేరుకున్నారు. అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. రద్దీతో అమ్మవారి దర్శనంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ అధికారులు ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం పంచహారతుల సేవలోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.

రామకథాగానం మధురాతి మధురం



సీతాకల్యాణం కథను గానం చేస్తున్న జయరాం సుధాకర్

విజయవాడ కల్చరల్: రామకథాగానం మధురాతి మధురం అని విఖ్యాత హరికథా భాగవతార్ గుడిపాటి జయరాం సుధాకర్ అన్నారు. హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయదాసు 159 జయంతి అయన శిష్యప్రశిష్యులు ఐదురోజులపాటు నిర్వహించే హరికథా ఉత్సవాలు సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణ మండపంలో శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు కార్యక్రమంలో సుధాకర్ ఆదిభట్లనారాయణదాసు రచించిన సంపూర్ణ రామాయణంలోని సీతాకల్యాణం ఘటాన్ని మధురంగా వినిపించారు. మూర్తీభవించిన ధర్మానికి ప్రతిరూపం అని రామజననం నుంచి సీతాకల్యాణం వరకు జరిగిన ఘటనలు వివరించారు. నేమాని నాగలక్ష్మి పార్వతీ కల్యాణం, యడవల్లి సుబ్రహ్మణ్యం భక్తప్రహ్లాద, ముదపాక బాలసుందరం నర్తనశాల, పి.వేదవతి శ్రీకృష్ణరాయబారం కథాగానం చేశారు. కార్యక్రమ కన్వీనర్ బుర్రా పద్మనాభశర్మ భాగవతులను సత్కరించారు.

గోరుముద్ద ప్రీతి'పాత్ర'ం

- పాఠశాలలకు కొత్త వంటపాత్రలు
- జిల్లాలో 1,536 బడులకు సరఫరా
- చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు శుభవార్త

సత్తెనపల్లి: పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శుభవార్త. ఏళ్ల తరబడి పాత, అరకొర వంట పాత్రలతో వంటల చేస్తున్న కార్మికుల కష్టాలు కొద్దిరోజుల్లో దూరం కానున్నాయి. విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రభుత్వం కొత్త వంట పాత్రలు సమకూర్చేందుకు రంగంసిద్ధం చేసింది. పాఠశాలల్లో 'జగనన్న గోరుముద్ద'ను మరింత రుచికరంగా సౌకర్యవంతంగా వండేందుకు వీలుగా వంటపాత్రలు సమకూర్చ నుంది. పల్నాడు జిల్లాలోని 1,536 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు కొత్త వంట పాత్రలు ఇచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గుంటూరు జిల్లాకు రాగా మరికొద్ది రోజుల్లో పల్నాడు జిల్లాలోని ప్రతి పాఠశాలకూ కొత్త వంట పాత్రలు సర ఫరా కానున్నాయి.

గ్రేడ్‌ల వారీగా పాఠశాలల విభజన

విద్యార్థుల సంఖ్య ఆధారంగా వంటపాత్రలు సమకూర్చేందుకు పాఠశాలలను గ్రేడ్‌లుగా జిల్లా విద్యాశాఖ అధికారులు విభజించారు. 30 మంది విద్యార్థులు లోపు ఉండే పాఠశాలలను ఏ-గ్రేడ్‌గా, 31-50 మధ్య బీ-గ్రేడ్‌గా, 51-150 మధ్య సీ- గ్రేడ్‌గా, 151-250 మధ్య డీ-గ్రేడ్‌గా, 251-400 మధ్య విద్యా ర్థులుండే పాఠశాలలను ఇ-గ్రేడ్ గా, 401 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులుండే పాఠశాలను ఎఫ్-గ్రేడ్‌గా విభజించారు.



గోరుముద్ద ఆహర పదార్థాలతో వంటపాత్రలు

వంట పాత్రల పంపిణీ ఇలా..

జిల్లాలో మొత్తం 1,536 పాఠశాలలకు జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా కొత్త వంట పాత్రలు అందజేస్తారు. వీటిలో 428 ఏ-గ్రేడ్ పాఠశాలలు, 316 బీ - గ్రేడ్ పాఠశాలలకు ఒక స్టీల్ హస్తం, ఒక స్టీల్ బేసిన్, ఐదు కేజీలు, ఎనిమిది కేజీల టబ్బు (అండాలు) ఒక్కోక్కటి, ఒక కళాయి, ఒక గరిట చొప్పున ఇవ్వనున్నారు. 482 సీ-గ్రేడ్ , 145 డీ-గ్రేడ్ పాఠశాలలకు ఒక స్టీల్ హస్తం, ఒక స్టీల్ బేసిన్, ఐదు కేజీలు, ఎనిమిది కేజీలు, 17 కేజీల అండాలు ఒక్కొక్కటి, ఒక కళాయి, ఒక గరిట చొప్పున ఇవ్వనున్నారు. అలాగే 90 ఇ-గ్రేడ్ పాఠశాలలకు, 75 ఎఫ్-గ్రేడ్ పాఠశాలలకు రెడు స్టీల్ హస్తాలు, రెండు స్టీల్ బేసిన్లు, ఐదు కేజీలు, 17 కేజీలు, 25 కేజీల అండాలు ఒక్కొక్కటి, ఒక కళాయి, ఒక గరిట చొప్పున ఇవ్వనున్నారు.

అన్ని పాఠశాలలకు వంట పాత్రలు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు జగనన్న గోరు ముద్ద పథకంలో భాగంగా పల్నాడు జిల్లాలోని 1,536 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో వంట ఏజెన్సీ మహిళలు మధ్యాహ్న భోజనాలను వండుతున్నారు. ఆయా పాఠశాలలన్నింటికీ విద్యార్థుల సంఖ్య ఆధారంగా చేసుకొని కొత్త వంట పాత్రలు ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. కొద్దిరోజుల్లో వంట సామగ్రి రానుంది. వచ్చిన వెంటనే ఆయా పాఠశాలలకు కొత్త పాత్రలను అందజేస్తాం.

– బత్తుల శ్రీనివాసరెడ్డి, ఏడీ, ఎమ్‌డీఎమ్, పల్నాడు జిల్లా